నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 22 ఏప్రిల్ 2024 | NIZAMABAD

రాజకీయమా! రైతు క్షేమమా?

- ఒకే సీజన్‌లో మూడుసార్లు దెబ్బకొట్టిన చెడగొట్టు వాన
- తడిసిన ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర సర్కారు మౌనం
- ఓట్ల వేటలో పడి కర్షకుల కన్నీళ్లను తుడవని కాంగ్రెస్
- నిజామాబాద్‌కు నేడు రేవంత్ రాక
- సీఎం భరోసా కోసం రైతుల ఎదురుచూపు

ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలకు ఆగమైన అన్నదాత

నిజామాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలతో పంటలు దెబ్బతినగా.. పలుచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పెద్ద మొత్తంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో అధికారం యంత్రాంగం విఫలమవగా.. ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో జాప్యం నెలకొనడం.. రైతులకు శాపంగా మారింది. అకాల వర్షాలతో ఆగమాగమవుతున్న రైతుల ఇబ్బందులను తీర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో నిజామాబాద్ జిల్లాకు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఫక్తు రాజకీయ కార్యక్రమానికే రేవంత్ హాజరయ్యాడు. ఇప్పుడు కూడా లోక్‌సభ ఎన్నికల్లో భాగంగానే ఇందూరు గడ్డకు వస్తున్నారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి తరపున ఎన్నికల సభలో రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అయితే సీఎం రాకకు మూడు రోజుల ముందే నిజామాబాద్ జిల్లాను అకాల వాన ఉక్కిరిబిక్కిరి చేసింది. వందలాది మంది రైతులు, వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తడిపేసింది. కల్లాల్లో తడిసిపోయిన వడ్లను చూస్తూ రైతులంతా బోరుమంటున్నారు. బాధను దిగమింగుకుంటూ బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తడిసిన ధాన్యాన్ని గతంలో కేసీఆర్ సర్కారు ఎలాంటి షరతులు లేకుండా కనీస మద్దతు ధరకే సేకరించింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు అండగా నిలిచే వారు కరువయ్యారన్న వాదన వినిపిస్తోంది. సీఎం రాక సందర్భంగా తమకు భరోసా కల్పించే ప్రకటనను రేవంత్‌రెడ్డి చేస్తారని జిల్లా రైతాంగం ఆశిస్తున్నది. కానీ ఫక్తూ రాజకీయ ప్రసంగాలకే పరిమితం అవుతున్న సీఎం మాత్రం రైతులకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటారా? లేదా? ఎన్నికల కోడ్ పేరిట ముఖం చాటేస్తారా? అన్న చర్చ జోరుగా సాగుతున్నది.



మూడుసార్లు ముంచెత్తిన వాన..

నెలన్నర వ్యవధిలో నిజామాబాద్, కామారెడ్డి రైతులపై మూడుసార్లు ప్రకృతి ప్రకోపం చూపింది. ఒకసారి అకాల వాన, మరోసారి వడగండ్లు ఆగం చేశాయి. మొన్నటికి మొన్న ఈదురుగాలులు, వర్షం, వడగండ్లు కలగలిసి బీభత్సం సృష్టించాయి. కోతకు వచ్చిన పంట చేతికి రాకుండానే నేలపాలయ్యింది. కల్లాల్లో నీరు చేరి ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. వర్షపు నీళ్లలోంచి వడ్ల గింజలను ఏరుకునేందుకు రైతులు పడుతున్న కష్టం చూస్తే గుండె తరుక్కుపోతున్నది. ఈ పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్ మాత్రం రైతులపై ప్రేమ నటిస్తున్నదని తప్ప.. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగంతోనైనా రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. కోడ్ ఆటంకంగా మారితే ఈసీ అనుమతితోనైనా విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లో అకాల వర్షంతో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడవడంతో కొనుగోళ్ల ప్రక్రియ నిలిచినట్లు సమాచారం. తేమ శాతం తక్కువ ఉంటేనే ధాన్యాన్ని కొనేందుకు ససేమిరా అంటున్న ప్రభుత్వ సిబ్బంది.. ఇప్పుడు పూర్తిగా తడిసిన వడ్లను సేకరించడం కష్టంగానే కనిపిస్తున్నది. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే తప్ప ఇది జరిగే పనిలా కనిపించడం లేదు. లేదంటే వ్యాపారులకు సగం ధరకే తడిసిన ధాన్యాన్ని అమ్ముకోవడం ఒక్కటే రైతుకు మిగిలిన అవకాశంగా కనిపిస్తున్నది.

అప్పుడలా... ఇప్పుడెలా?

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చీటికి మాటికి ఆరోపణలు చేస్తూ పబ్బం గడిపిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు రూట్ మార్చింది. అధికారంలోకి రాగానే హామీలను వాయిదాలు వేస్తూ రైతులను మోసం చేస్తున్నది. కష్టాల్లో ఉన్న అన్నదాతను ఆదుకునేందుకు ముందుకు రావడంలేదు. గతంలో చెడగొట్టు వానలు పడితే కేసీఆర్ సర్కారుపై నిందలు వేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భారీ కుట్రలు చేశాయి. కేసీఆర్ సర్కారు మాత్రం ఎక్కడా వెనకడుగు వేయకుండా నష్టాలు వచ్చినా తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతోనే కొనుగోలు చేసింది. అలాంటి పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురైన తొలి వ్యవసాయ సీజన్‌లోనే సర్కారు చర్యలు ఈ రకంగా ఉంటే మున్ముందు ఎలా ఉండనున్నదో? అని రైతులు నిట్టూరుస్తున్నారు. కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ధాన్యం సేకరణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీకి చేరికలపై ఉన్న ధ్యాస రైతు సమస్యలపై లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 21: దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్, గారడీ మాటలు చెప్పే బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ చర్చిలో ఆదివారం నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా అమలు చేయని కాంగ్రెస్‌కు ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. తనను మంచి మనసుతో ఆశీర్వదించి లోక్‌సభకు పంపిస్తే తెలంగాణ సమస్యలపై గళమెత్తడంతోపాటు జిల్లా అభివృద్ధికి కోట్లాడి నిధులు తెచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తానన్నారు.

వాకర్స్ సమస్యలను తెలుసుకుంటున్న బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల

వాకర్స్‌తో చిట్‌చాట్..

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 21: నగరంలోని ఐటీఐ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం వాకర్స్‌తో బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల చిట్‌చాట్ చేశారు. ఆప్యాయంగా పలకరిస్తూ ముచ్చటించారు. వారితో కలిసి క్రీడల్లో పాల్గొన్న అనంతరం అల్పాహారం చేశారు. వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు కావాలని కోరారు. నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వేముల, పక్కన బాజిరెడ్డి, బిగాల, జీవన్‌రెడ్డి, విఠల్‌రావు, వీజీగౌడ్, ఆయేషా ఫాతిమా

సుదర్శన్‌రెడ్డి నిరంకుశత్వానికి బుద్ధి చెప్పండి..

- బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం
- బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి వేముల

శక్కర్‌నగర్/బోధన్, ఏప్రిల్ 21: బోధన్ ఎమ్మెల్యేగా గెలిచిన సుదర్శన్‌రెడ్డి అహంకారం, నిరంకుశత్వం ప్రదర్శిస్తున్నారని, ఆయనకు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, బాల్కొండ వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతలపై కేసులు పెడతామని బెదిరించడం, అవిశ్వాస తీర్మానాలతో రాజకీయాలు చేయడం చూస్తుంటే.. సుదర్శన్‌రెడ్డికి పోయేకాలం దగ్గరపండిందని అనిపిస్తున్నదని, ఆయనకు బోధన్ నియోజకవర్గ ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు వచ్చాయని అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సరయూ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వేముల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్‌పై పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గమని, పిల్లవాడన్న జ్ఞానం కూడా లేకుండా రాజకీయకక్షతో ఇలా చేయడాన్ని ప్రజలు క్షమించబోరని అన్నారు. షకీల్ అందుబాటులో లేకపోయినా కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేసి బాధ్యతలను తన భుజాలకు ఎత్తుకున్న ఆయన సతీమణి ఆయేషా ఫాతిమాను అభినందించారు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే అండగా ఉన్నారని, లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్‌తో సుదర్శన్‌రెడ్డి మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని గెలిచాడని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని నిలబెట్టడం వెనుక సుదర్శన్‌రెడ్డి హస్తం ఉన్నదని, ఆయన అడ్డును కూడా తొలగించుకునే దురుద్దేశం ఉందన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని అన్నారు.

బోధన్-బీదర్ రైల్వేలైన్‌ను నిర్మిస్తాం..

-బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ ఎంపీగా గెలిచిన వెంటనే బోధన్ – బీదర్ రైల్వే మార్గాన్ని నిర్మాణం చేయిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని కాంగ్రెస్, బీజేపీలు రాజకీయం కోసం వాడుకుంటున్నాయని, ఆ పార్టీలకు చెరుకు రైతులు, కార్మికులపై ఎంతమాత్రం చిత్తశుద్ధిలేదని విమర్శించారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత నిజాం షుగర్స్‌ను తెరిపించే బాధ్యత తీసుకుంటానన్నారు. ఐదేండ్లపాటు ఎంపీగా ఉన్న అర్వింద్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ఎందుకు ప్రయత్నించలేదని గోవర్ధన్ ప్రశ్నించారు. బోధన్ నియోజకవర్గంలో సుదర్శన్‌రెడ్డి అరాచకాలను ఎదుర్కొంటానని పేర్కొన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కోరారు. సమావేశం అనంతరం ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్, బోధన్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, బీఆర్ఎస్ బోధన్ నియోకజవర్గం నాయకులు గిర్దావర్ గంగారెడ్డి, పి.రవికిరణ్, గోగినేని నరేంద్రబాబు (నర్సయ్య), సంజీవ్‌కుమార్, రవీందర్‌యాదవ్, నర్సింగ్‌రావు, ఎం.ఎ.రజాక్, భూంరెడ్డి, శ్రీరామ్, తెలంగాణ శంకర్, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

'తరుగు'పై అధికారుల విచారణ

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 21: మండలంలోని బరంగేడ్గి గ్రామంలో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత, రైస్ మిల్లర్లు క్వింటాలుకు ఐదు కిలోల తరుగు తీస్తుండడంపై రైతులు శనివారం ఆందోళన చేసి, తహసీల్దార్ లతకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. ఆదివారం జిల్లా అధికారులు బీర్కూర్ మండల కేంద్రానికి చేరుకొని తరుగు, కొనుగోళ్ల నిలిపివేతపై విచారణ చేపట్టారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ఒకవేళ తరుగు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేశ్‌బాబు ఉన్నారు.

బీర్కూర్‌లోని రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న డీసీఎస్‌వో మల్లికార్జున్ బాబు

పిడుగుపాటుకు నక్కలు మృతి

నందిపేట్, ఏప్రిల్ 21: డొంకేశ్వర్ మండల పరిధిలోని నూత్‌పల్లి గ్రామశివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఎలక్ట్రిక్ పోల్‌పై పిడుగు పడి హైటెన్షన్ వైర్ తెగి పడిపోయింది. అదే ప్రాంతంలో సంచరిస్తున్న మూడు నక్కలు తెగిపోయిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందినట్లు మండల వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్, అసిస్టెంట్ వెటర్నరీ వైద్యుడు కృష్ణ, డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ ఆదివారం తెలిపారు. వాటికి పోస్టుమార్టం అనంతరం దహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

నక్కల కళేబరాలను పరిశీలిస్తున్న అధికారులు

గులాబీ రథాలు సిద్ధం

లోక్‌సభ ఎన్నికల పోరులో బీఆర్ఎస్ దూకుడు ప్రదర్శిస్తున్నది. నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ అన్ని పార్టీల కన్నా ప్రచారంలో ముందున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే నియోజకవర్గాన్ని చుట్టివచ్చారు. ఇటీవలే నామినేషన్ కూడా దాఖలు చేసిన ఆయన.. మరింత జోరు పెంచనున్నారు. ఇందులో భాగంగా బాజిరెడ్డికి మద్దతుగా ఊరూరా ప్రచారం చేసేందుకు గులాబీ రథాలు సిద్ధమయ్యాయి.

-స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నిజామాబాద్